క్లుప్తంగా

ఎంపీడీఓగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



కొత్తపల్లి: కొత్త ఎంపీడీఓగా పి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ వెంకటనారాయణ కోటనందూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అధికంగా విజృంభిస్తున్న కారణంగా మండలంలో దీనిపై అవగాహన కల్పించడం, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

అలరించిన భరత నాట్యం



భరత నాట్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

సామర్లకోట: శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం చూపరులను ఆకట్టుకుంది. శ్రీకామాక్షి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిత్యం ఉదయం, సాయంత్రం దంపతులతో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని సంఘ సభ్యులు తెలిపారు.

ఎంపీడీఓకు సత్కారం



వెంకట నారాయణను సత్కరిస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: ఇక్కడి నుంచి బదిలీ అయిన ఎంపీడీఓ పి.వెంకట నారాయణను గురువారం ఘనంగా సత్కరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కోటనందూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకట నారాయణను ఈఓపీఆర్డీ కర్రి హరికష్ణ సత్యరెడ్డి ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు



కావమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో గురువారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూజలు నిర్వహించారు. స్థానిక మానరమ్మ ఆలయం సమీపంలో మట్టపలివారి వీధిలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారు, చంద్రశేఖరస్వామి ఆలయం వద్ద ఉన్న సత్తెమ్మతల్లిని, ఏలేరు కాలువ అవతలి వైపు ఉన్న కావమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా కబడ్డీ సంఘ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, రజక సంఘ జిల్లా అధ్యక్షుడు గొల్తి సత్యనారాయణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు ఉన్నారు.

సైకిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపల్లి: కొండెవరంలో ఉన్న జెడ్పీ పాఠశాలలో విద్యార్థుల సైకిల్ షెడ్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. దీనికి పూర్వ విద్యార్థులు, సన్‌రైజ్ క్రికెట్ టీం సభ్యులు రూ.6 లక్షలను విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని విద్యా కమిటీ చైర్మన్ రాంబాబు అభినందించారు.

సినిమాలు



పెద్దాపురం

లలితా స్క్రీన్-1:	మా నాన్న సూపర్ హీరో, విశ్వం
లలితా స్క్రీన్02:	దేవర పార్ట్-1
వీరభద్ర:	వేట్టయన్
శోభా:	మార్టిన్

సామర్లకోట..

అనుశ్రీ స్క్రీన్-1:	దేవర పార్ట్-1
అనుశ్రీ స్క్రీన్-2:	మార్టిన్
విఘ్నేశ్వర:	విశ్వం, వేట్టయన్

రహదారిద్ర్యం

ప్రజల కష్టాలు పాలకులకు పట్టడం లేదు. ఎనిమిదేళ్ల నుంచి జనానికి అపసోపాలు తప్పడం లేదు. గ్యాస్ పైపులైన్లకు తవ్విన రోడ్లను వేసుకోండంటూ పరిహారం ఇచ్చినా.. కొన్నిచోట్ల రహదార్లు నిర్మించలేదు. దీనిపై అధికార యంత్రాంగం కూడా కనీస దృష్టి పెట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

- ఏళ్లు గడుస్తున్నా మోక్షానికి నోచుకోని రోడ్డు
- రోడ్డు మార్జిన్‌లో పెరిగిపోతున్న తుప్పలు
- బహిరంగ మరుగుదొడ్డిగా సత్యనారాయపురం రోడ్డు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రోడ్డు మార్జిన్‌లో పెరిగిన తుప్పలు



గోతులు, రాళ్లతో నిండి ఉన్న 23వ వార్డులో ప్రధాన రహదారి

సామర్లకోట: సుమారు ఎనిమిదేళ్ల క్రితం గ్యాస్ పైపులైన్ల కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో గోతులు తవ్వారు. అయితే 23వ వార్డులోని సత్యనారాయణపురం ప్రధాన రహదారితో పాటు, పలు రోడ్లలో తవ్విన గోతులు మట్టిని పూడ్చి వదిలేశారు. ఇప్పటి వరకు ఈ రోడ్డుపై అధికారులు కనీస దృష్టి సారించిన దాఖలాలు లేవు. అలాగే స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి సత్యనారాయణపురం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎఫ్‌సీఐ గోదాములకు బ్రిడ్జి పక్కనున్న రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం తవ్విన గ్యాస్ పైపులైను కారణంగా, ఆ రోడ్డు గోతులతోనే నిండి ఉంది. ఆ రోడ్డులోనే ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రోడ్డు ప్రారంభంలో బార్ ఏర్పాటు చేశారు. బార్‌లోకి వెళ్లడానికి డ్రైన్‌పై కల్వర్టును ఎత్తుగా చేశారు. దాంతో ఒకవైపు గోతులు, మరోవైపు ఎత్తయిన కల్వర్టుతో చిన్న వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

నష్ట పరిహారం చెల్లించినా..

మున్సిపాలిటీ పరిధిలో అనేక రోడ్ల మీదుగా గ్యాస్ పైపులైన్ పనులు పూర్తి చేసి, సంబంధిత గ్యాస్ కంపెనీ ప్రతినిధులు మున్సిపాలిటీకి నష్ట పరిహారం చెల్లించారు. దాంతో మున్సిపాలిటీ పరిధిలో అనేక రోడ్లను నిర్మించారు. అయితే సత్యనారాయణపురం రోడ్డును మాత్రం నిర్మించ లేదు. మున్సిపాలిటీకి అత్యధిక ఆదాయం చేకూర్చే వనరులున్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆ వార్డు కౌన్సిలర్ సేపెని సురేష్ రోడ్డు నిర్మాణంపై ప్రశ్నించినా, కమిషనర్ కానీ, ఇంజినీరింగ్ అధికారులకు కానీ సరైన అవగాహన లేకపోవడంతో స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయారు.

పెరిగిపోతున్న తుప్పలు

రోడ్డు మార్జిన్‌లో తుప్పలు, గడ్డి విపరీతంగా పెరిగిపోవడంతో విషసర్పాలు స్వైర్వవిహారం చేసున్నాయి. రోడ్డు మార్జిన్‌లో ఉన్న డ్రైన్ వైపు మట్టి దిమ్మలు, తుప్పలు పెరిగిపోవడంతో వర్షపు నీరు డ్రైన్‌లోకి వెళ్లే మార్గం కనిపించడం లేదు. దాంతో వర్షం వచ్చిన సమయంలో ఈ రోడ్డు చెరువుగా మారుతుంది. ఈ రోడ్డు అపరిశుభ్రంగా ఉండటంతో బహిరంగ మరుగు దొడ్డిగా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలోనే కాకుండా, పట్టపగలు బహిరంగ మరుగుదొడ్డిగా ఉపయోగిస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న తుప్పలను తొలగించి,, కనీసం బీటీ రోడ్డయినా నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

వారికి అన్నీ సమస్యలే..

నడిచే ఎద్దునే పొడుస్తారన్నట్టు.. ఆదాయం వచ్చే వార్డులోనే సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎఫ్‌సీఐ నుంచి మున్సిపాలిటీకి అత్యధికంగా ఆదాయం సమకూరుతుంది. అయినా ఆ వార్డు సమస్యలపై అధికార యంత్రాంగం కనీస శ్రద్ధ చూపడం లేదు. ఈ వార్డుకు చేరుకోవడానికి రెండు మార్గాలున్నాయి. ఒక రోడ్డులో బార్, మరో రోడ్డులో మద్యం షాపు ఉండటంతో, మహిళలు రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా కొత్త మద్యం షాపులు కేటాయించే సమయంలో, ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో మద్యం షాపు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. బార్ గడువు పూర్తయ్యాక మరోచోట ఏర్పాటు చేయాలంటున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



సుమారు 8 ఏళ్లగా గోతులతో ఉన్న రోడ్డులో సైకిల్‌పై వెళ్లే విద్యార్థులు, చిన్న వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు బార్, మరోవైపు మద్యం దుకాణం ఉండటంతో మహిళల ఇబ్బంది తీవ్రంగా ఉంది. మద్యం షాపుల కేటాయింపులో ప్రస్తుతం ఉన్న షాపును తొలగించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాం.

– పదాల వీరబాబు, 23వ వార్డు నివాసి, సామర్లకోట

రోడ్డు సమస్యను పరిష్కరిస్తాం



సత్యనారాయణపురం రోడ్డుకు గతంలో టెండరు పిలిచినట్టు తెలిసింది. కారణాలు తెలుసుకుని టెండరు పిలిస్తే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం. అదే విధంగా రోడ్డు మార్జిన్‌లో పెరిగిన తుప్పలు తొలగించి, రోడ్డుపై నీరు డ్రైన్‌లోకి పోయే విధంగా శానిటరీ అధికారికి సూచనలు ఇస్తాం.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: అష్టమి పూర్వాషాఢ నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈఓ భ్లోళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు అంజిబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

సబ్ రిజిస్ట్రార్‌గా సత్యనారాయణ



సామర్లకోట: కొత్త సబ్ రిజిస్ట్రార్‌గా జీవీవీ సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఈ.లక్ష్మి కడియం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరం నుంచి బదిలీపై వచ్చిన సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు.

వేట్లపాలెంలో మహా కుంభాభిషేకం



అమ్మవారి అభిషేకానికి గోదావరి జలాలు తెస్తున్న మహిళలు

సామర్లకోట: కెనాల్ రోడ్డులోని వేట్లపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గ ఆలయంలో గురువారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విజయదుర్గగా అలంకరణ చేశారు. ఈ సందర్భంగా 108 మంది మహిళలు, యువతులు కలశాలతో గోదావరి కాలువలో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో అర్చకులు సురేష్ ఆచార్యులు అమ్మవారికి అభిషేకాలు, పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

మానసిక ఆరోగ్యంపై శిక్షణ



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న సాయివంశీ

సామర్లకోట: ప్రజల మానసిక ఆరోగ్యం కోసం స్థానిక సీబీఎం సెంటర్‌లోని రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ కార్యాలయంలో గురువారం మానసిక ఆరోగ్య సదస్సు, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య బిర్లా గ్రూప్ ప్రతినిధులు సాయివంశీ ఆర్‌డీఎస్, నీడ్, పరిష్కార్ స్వచ్ఛంద సంస్థల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారిని సమస్యలు ఎదుర్కొనేలా చేయాలన్నారు. ఈ నెల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని చికిత్స కోసం ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసన్నరాజు, శ్రీనివాసు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండగ

సామర్లకోట: వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, గుర్తించిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి ఈ నెల 14 నుంచి 20 వరకు పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు. ఆయా కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఉత్సవాల్లో నిబంధనలు తప్పనిసరి



ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో కమిటీ సభ్యులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. నిమజ్జనం జరిగే తీర ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోనపాపపేట నుంచి ఉప్పాడ శివారు సబ్బంపేట సమీపంలో ఉన్న తీర ప్రాంతానికి సంబంధించి రెండు చోట్ల అమ్మవారి విగ్రహాలను నిమజ్జనానికి అనుమతి ఇచ్చినట్టు చెప్పారు. పూర్తి స్థాయిలో పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జనానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలు నిర్వహించరాదని, కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ ప్యాంట్రీ కారు తనిఖీ

గుర్తింపు కార్డుల్లేని వారికి జరిమానా



బొకారో ప్యాంట్రీ కారులో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: రైల్వే ప్లాట్‌ఫారాలతో పాటు, రైళ్లలోను ప్రయాణికులకు విక్రయించే ఆహార పదార్థాలు నాణ్యతతో ఉండాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సామర్లకోటకు చేరిన బొకారో(13351) ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న ప్యాంట్రీ కారులో ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యత కలిగిన సరకులను వినియోగించాలని సూచించారు. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా రెండు, మూడు ప్లాట్‌ఫారాలపై ఉన్న ఫ్రూట్ స్టాళ్లు, జ్యూస్ స్టాళ్లు, కూల్‌డ్రింక్ షాపులను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫారంపై ఉన్న స్టాళ్లలో విక్రయించే తినుబండరాల గడువు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎమ్మార్పీ కంటే తక్కువ ధరలకే విక్రయించాలన్నారు. ప్లాట్‌ఫారాలపై తినుబండరాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఐడీ కార్డులు లేకపోవడంతో, రూ.ఐదు వేల వంతున జరిమానా విధించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 వరకు స్వచ్ఛ పఖ్వాడా కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఇతర సిబ్బంది ఉన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

పెద్దాపురం: వరదల కారణంగా నష్టపోయిన మర్లావలోని 12 కుటుంబాల వారికి గురువారం పెద్దాపురం పట్టణ పాండవగిరి పెయింటిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆర్థిక సాయం అందజేసింది,. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డి సత్యనారాయణ, యాసలపు మహేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బాధిత కుటుంబాలకు రూ.ఐదు వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. వరద బాధితుల కోసం పెయింటింగ్ వర్కర్స్ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. యూనియన్ తరఫున సుమారు రూ.60 వేలు వసూలు చేసి, బాధితులకు సమకూర్చినట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట రామకృష్ణ, గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అమ్మా భవాని..



దుర్గాడలో అమ్మవారికి 108 రకాల వంటలతో మహాభోగ నివేదన



దుర్గాదేవిగా పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరి దేవి



విశేషాలంకరణలో పురుహూతికా అమ్మవారు



మహాగౌరి అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి



కొత్తపల్లిలో దుర్గాదేవి అమ్మవారు



దుర్గాదేవి అవతారంలో పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు



దుర్గాంబిక అవతారంలో భువనేశ్వరి మాత



కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు



కొమరగిరిలో నటరాజేశ్వరిగా..



గొల్లప్రోలులో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం

- దుర్గాదేవిగా రాజరాజేశ్వరి దేవి
- ఘనంగా దుర్గాష్టమి పూజలు

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాలలో భాగంగా రాజరాజేశ్వరి దేవి దుర్గాదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురుహూతికా దేవికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గ అమ్మవారి ఆలయాలలో శనివారం నిర్వహించనున్న దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు వివిధ వ్యాపార సంస్థల యజమానులు దసరా ప్రత్యేక పూజలకు సిద్ధం చేసుకున్నారు.

ప్రసిద్ధి చెందిన గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రీలలితా దేవికి, గర్భాలయంలో సూర్యదేవునికి, ఉమాదేవి అమ్మవార్లకు, లక్ష్మీనారాయణులకు, గణపతికి, శివునికి ఏకకాలంలో అష్టోత్తర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు సోదరులు సౌభాగ్య మహిళలతో మహా గణపతి పూజ, పుణ్యాహవాచన, మహాన్యాస పారాయణ 27 ద్రవ్యాలతో, 27 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి 108 రకాల పిండి వంటలతో మహాభోగ నివేదన చేశారు. నీరాజన హారతి, మంత్రపుష్పాలు సమర్పించారు..ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. మహాగౌరి అలంకరణలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి రుద్రాక్షల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురంలో మహాలక్ష్మి దేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలులో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. పిఠాపురం మండలం రాపర్తిలో వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వరి అమ్మవారికి రూ.15 లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిగా అలంకరించారు. కొత్తపల్లి అమ్మవారు దుర్గాదేవిగా దర్శన మిచ్చారు.

దుర్గాంబగా భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక వర్ధుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో గురువారం భువనేశ్వరి అమ్మవారు దుర్గమ్మ అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజాదికాలు, చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈఓలు సౌజన్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీధర్మశాస్తా ఆలయంలో గురువారం కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కొమరగిరిలో బాల కనకదుర్గాదేవి నటరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.